

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

బడా గణేశ్ ఉత్సవాలకు సీఎం, డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణపతి వద్ద తొలిరోజున పూజలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు వేద పండితులతో గురువారం ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానించారు. భట్టితో పాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, తదితర ప్రముఖులకు ఉత్సవ కమిటీ ఆహ్వానాలను అందజేసింది.

కేబీఆర్ పార్కు వద్ద భూమిలో నుంచి పొగలు

బంజారాహిల్స్ సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద భూమిలో నుంచి పొగలు రావడం కలకలం సృష్టించింది. పార్కు వెలుపల ఉన్న జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలంలో గురువారం సాయంత్రం భూమిలో నుంచి పొగలు రావడం వాకర్లు గమనించారు. క్రమంగా పొగ పెరగడంతో పాటు స్వల్పంగా మంట రావడంతో భూగర్భ విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ జరుగుతుందని వాకర్లు వాపోయారు. విషయాన్ని ట్రాన్స్‌కో ఫిర్యాదు చేశారు.

8న పవర్‌లిఫ్టింగ్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఈనెల 8వ తేదీన జరగనున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ వన్‌లోని డీజే ఫిట్‌నెస్ వరల్డ్ సెంటర్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు ఇంటూరి రేఖ తెలిపారు. పురుషులకు 52 కిలోల నుంచి 140 కిలోల విభాగాల వరకు మహిళలకు 44 కి. నుంచి 100 కి. విభాగాల వరకు పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం ఈ నెంబర్‌కు 7330778111 సంప్రదించవచ్చు.

28న మిస్ అండ్ మిసెస్ గ్రాండ్ ఫినాలే

బంజారాహిల్స్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): మిస్ అండ్ మిసెస్ ఫ్యాబులస్ ఎడిషన్-3 గ్రాండ్ ఫినాలె పోటీలు ఈనెల 28న నిర్వహించనున్నట్టు నటి మినాక్షి ఓజా తెలిపారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటి మాట్లాడుతూ ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకునే యువతులకు ఇలాంటి పోటీలు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్, ఆల్మైటీ మేకప్ స్టూడియో మేనేజర్ ప్రీణ్ బ్రహ్మశ్రీ రామకృష్ణ, సంజన్, రవీందర్ పాల్గొన్నారు.

ఫతేనగర్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ అడ్డంకుల తొలగింపు

సనత్‌నగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద పేరుకున్న చెత్త, అక్రమ నిర్మాణాలను ట్రాఫిక్ పోలీసులు గురువారం తొలగించారు. ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద ఉన్న రోడ్డు ద్వారా సనత్‌నగర్ నుంచి బల్కంపేట మీదుగా బేగంపేటకు వెళ్లే అవకాశముంది. అయితే, ఈ ప్రాంతం మొత్తం చెత్త వేయడం, ఆక్రమణలలో కుచించుకు పోయింది. దీంతో రంగంలోకి దిగిన సనత్‌నగర్ పోలీసులు ఈ రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. అంతేకాకుండా రోడ్డు పక్కన వేసిన చెత్తను, వరద కారణంగా వచ్చిన బురదను తొలగించి, రోడ్డును అందుబాటులోకి తెచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. 11కేవీ దివ్యా డైమండ్, ఇందిరానగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు, 11కేవీ ఫోనిక్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 11కేవీ శ్రీకృష్ణానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 11కేవీ రహమత్ నగర్ బంగారు మైసమ్మ, అమర్ సొసైటీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

తెలుగు మీడియం రెస్టారెంట్‌లో
కాలం చెల్లిన జ్యూస్.. నిల్వ చేసిన చికెన్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన జ్యూస్, ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసిన చికెన్‌ను జూబ్లీహిల్స్ తెలుగు మీడియం రెస్టారెంట్‌లో అధికారులు గుర్తించారు. రెస్టారెంట్‌లో బిర్యానీలో వెంట్రుకలు వచ్చాయన్న ఫిర్యాదు మేరకు ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. కాలంచెల్లిన జ్యూస్‌తో పాటు మష్రూమ్‌లను వినియోగిస్తున్నట్టు గుర్తించారు. వెజ్- నాన్ వెజ్ తినుబండారాలను ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచి వినియోగదారులకు అందిస్తున్నట్టు గుర్తించారు. దీంతో రెస్టారెంట్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు.

స్మోక్ బార్‌లో ఈ సిగరెట్‌లు.. ఒకరి అరెస్ట్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఈ సిగరెట్‌లు అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని స్మోక్ బార్‌లో నిషేధిత ఈ సిగరెట్ల అమ్మకాలు జరుగుతున్నాయని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు చేయగా భారీగా ఈ సిగరెట్లు లభించాయి. స్మోక్ బార్ మేనేజర్ షేక్ ముజామిల్, వాచ్‌మన్ గోలు కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. స్మోక్ బార్ యజమాని సల్మాన్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తు తెలియని వ్యక్తిమృతి



అమీర్‌పేట, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 10 రోజులుగా ఎస్ఆర్‌నగర్‌లోని మెట్రోస్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి(50) బుధవారం రాత్రి మృతిచెందాడు. స్థానికులు గమనించి విషయం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

అవినీతి, నిర్లక్ష్యంపై డిస్కం వేటు

- 7 నెలల్లో 19 మంది సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు
- ఆరుగురి సస్పెన్షన్.. నలుగురు కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ
- 9 మందికి షోకాజ్ నోటీసులు
- జాబితాలో మరికొంతమంది అవినీతి అధికారులు
- త్వరలో వారిపై చర్యలు తీసుకునే అవకాశం..?



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో అవినీతికి పాల్పడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో గడిచిన 7 నెలల్లో 19 మంది ఇంజనీర్లు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆరుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేయగా, నలుగురిని కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ చేయగా మరో 9మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అవినీతి ఆరోపణల జాబితాలో మరికొంతమంది అధికారుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయి లో అంతర్గత విచారణ చేసి వారిపై కూడా త్వరలో చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది. అక్రమార్కుల జాబితాలో కొందరు ఉన్నతాధికారులున్నారని వారిపై లోతుగా విచారణ జరిపి ఆ తర్వాతే చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏ శాఖలో లేని విధంగా ఆదాయం ఎక్కువ తెచ్చిపెట్టే ప్రాంతాలు ఫోకల్, ఆదాయం తక్కువ వచ్చేప్రాంతాలు నాన్‌ఫోకల్‌గా విభజించారు. ఫోకల్ ప్రాంతాల్లో పోస్టింగుల కోసం కొందరు అధికారులు ఇప్పటికే రాజకీయనేతలతో పైరవీలు చేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. 15 రోజుల క్రితం సరూర్‌నగర్ సర్కిల్‌లో డీఈటీ ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.18 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఏడాది క్రితం గచ్చిబౌలిలో ఏడీఈ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దృష్టి

గ్రేటర్‌జోన్ పరిధి శివారు సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులపై ఎక్కువ అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సైబర్‌సిటీ సర్కిల్‌లో గతంలో ఓ సబ్‌డివిజన్‌ను రెండు సబ్‌డివిజన్లుగా విభజించి మరో ఇద్దరు ఏడీఈలకు పోస్టింగులిచ్చారు. సైబర్‌సిటీ సర్కిల్ కొండాపూర్ డివిజన్‌లోని అల్లాపూర్ సెక్షన్‌లో ఓ లైన్‌మన్‌తో పాటు ఇద్దరు ఆర్టిజన్లను సస్పెండ్ చేశారు. అవినీతి ఆరోపణలు, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మంగళవారం ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేడ్కర్‌ను కార్పొరేట్ ఆఫీస్‌కు అటాచ్‌చేయగా, నార్సింగ్ ఏఈ సందీప్ రెడ్డిని సస్పెండ్ చేశారు. మేడ్చల్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సైబర్ సిటీ, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలోని పలు సబ్‌డివిజన్లలో కొంతమంది ఏడీఈలతో పాటు ఏఈలపై పెద్ద సంఖ్యలో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోపణలు వచ్చే అధికారులను త్వరలో జరిగే బదిలీల్లో కార్పొరేట్ ఆఫీస్‌తో పాటు ఆఫీస్ పోస్టులకే పరిమితం చేయనున్నారు.

కీలకమైన మెట్రోజోన్ సీఈ పోస్టు ఖాళీ

గ్రేటర్ విద్యుత్ సరఫరాలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా బాధ్యతలు నిర్వహించిన మోహన్‌రెడ్డి ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆపరేషన్ విభాగంలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా ఇప్పటి వరకు ఎవ్వరిని నియమించకపోవడంతో పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. సీనియర్ స్థాయి ఎస్ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు భారీవర్షాలు, మెట్రోజోన్‌లో పెరుగు తున్న విద్యుత్ డిమాండ్, సమస్యలు పరిష్కరించాలంటే గ్రేటర్‌జోన్‌పై పూర్తిగా అవగాహన కలిగిన సీనియర్ సీఈకి మెట్రోజోన్ సీఈ బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

ఎర్రగడ్డ రైతు బజార్‌లో
కొనుగోలుదారుల సందడి

- వినాయక విగ్రహాలు, పూలకు భలే గిరాకీ
- కూరగాయలు, ఆకుకూరలకు డిమాండ్

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నేపథ్యంలో ఎర్రగడ్డ రైతు బజార్‌లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. ప్రతి సంవత్సరం వినాయక చవితికి రైతుబజార్‌లో చుట్టుపక్కల పూల వ్యాపారులు, వినాయక విగ్రహాల వ్యాపారులు చాలామంది ఇక్కడ వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. పండుగ ఒక్క రోజే ఉన్న నేపథ్యంలో అటు వినాయకులకు, ఇటు పూల వ్యాపారులకు గిరాకీ పెరిగింది. పండుగ నేపథ్యం లో ఎర్రగడ్డ రైతు బజార్‌కు కూరగాయలు కూడా అధిక సంఖ్యలో దిగుమతయ్యాయి. కూరగాయల ధరలు కూడా కాస్త తగడంతో వినియోగదారులు కూరగాయల కొనుగోలుకు రైతు బజార్‌కు అధిక సంఖ్యలో వచ్చారు.

పూలకు పెరిగిన గిరాకీ..

వినాయక చవితి నేపథ్యంలో రైతు బజార్‌లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో పూల వ్యాపారాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా వినాయక చవితికి ప్రత్యేకంగా ఉపయోగించే ఆకుకూరలలో ఒకటైన తుమ్మి కూరను వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేశారు. పండుగ నేపథ్యంలో వినియోగదారులు తాకిడి పెరిగింది. రైతు బజార్‌కు శుక్రవారం సెలవు కావడం, వినాయక చవితి శనివారం వస్తున్న నేపథ్యంలో గురువారమే రైతు బజారుకు ఎక్కువగా వినియోగదారులు వచ్చి కూరగాయలను కొనుగోలు చేశారు.



రైతు బజార్‌లోని స్టాల్



రైతు బజార్ ఎదురుగా పూల వ్యాపారులు

వినాయక చవితి నేపథ్యంలో



వినాయక చవితి నేపథ్యంలో రైతుబజార్‌కు వినియోగదారులు తాకిడి పెరిగింది. మామూలు రోజుల కన్నా కూరగాయలు, తుమ్మికూరను కొనుగోలు చేయడానికి ఎక్కువమంది వినియోగదారులు వచ్చారు. శుక్రవారం రైతుబజార్‌కు సెలవు కావడంతో గురువారమే ఎక్కువమంది రైతు బజార్‌కు విచ్చేశారు.

- శాంతమ్మ, రైతు, తూప్రాన్ గ్రామం

పెరిగిన పూల ధరలు



వినాయక చవితి నేపథ్యంలో పూలధరలు అమాంతం పెరిగాయి. మామూలు రోజులలో బంతిపూలు రూ.40, 50కి కిలో ఉంటాయి. గురువారం మాత్రం రూ.100కు పైగానే అమ్మారు. గురువారమే పూలధరలు ఇలా ఉంటే శుక్రవారం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

- సి.నాగేశ్వరరావు, వినియోదారుడు



బోరబండ బస్‌స్టాప్‌లో భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తానా, నాయకులు, కార్యకర్తలు

- బోరబండ, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి)



కార్మికనగర్‌లో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

- యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి)



గణేశ్ నవరాత్రుల సందర్భంగా యూసుఫ్‌గూడ సర్కిల్-19 డీఎంసీ జకీరా సుల్తానా యూసుఫ్‌గూడ, బోరబండ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

-యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి)

మట్టి గణపతిని పూజిద్దాం..
పర్యావరణాన్ని కాపాడుదాం

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



కృష్ణనగర్ లేబర్ అడ్డా వద్ద మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మట్టగణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణనగర్ లేబర్ అడ్డా వద్ద, వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ సాయిబాబా మందిరం వద్ద ఆయన మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు బి.రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు, జీహెచ్ఎంసీ ఏఎంసీ కమల్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్ ముదిరాజ్, ఐలపాక నర్సింగ్‌దాస్, కైసర్‌జాన్, గీతాగౌడ్, అమ్మాజీ, నిర్మల, రమాదేవి, వేణుగోపాల్, సంతోష్, శరత్, హజర్, ఫయీం, ధర్మారావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలపై అవగాహన



బేగంపేటలో మట్టి విగ్రహాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధులతో కళాశాల అధ్యాపకులు

బేగంపేట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వసుధ సూచించారు. గురువారం బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలకు సంబంధించిన అవగాహన కార్యక్రమంతో పాటు క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మట్టి గణపతులను తయారు చేయించారు. గణపతుల తయారీలో ప్రతిభ కనబరిచిన వారికి, క్విజ్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఉషారాణి, వెంకటేశ్వర్లు, ఇకోక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘మా స్థలంలో గణేశ్ ఉత్సవాలను అడ్డుకోవద్దు’

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ‘ప్రభుత్వం మాకు కేటాయించిన స్థలంలో మేం గణేశ్ నవరాత్రుల కోసం మండపం ఏర్పాటు చేసుకుంటుంటే అడ్డుకోవటం సరికాదు’అని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్ నాయీ అన్నారు. మంగళవారం రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్ నందినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 2021లో నందినగర్‌లో 120గజాల స్థలాన్ని తమ సంఘానికి కేటాయించారని తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ పత్రాలు కూడా ఇచ్చారని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరమూ ఇక్కడ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం గణేశ్ మండపానికి ఏర్పాట్లు చేసుకుంటుంటే కొందరు వచ్చి అడ్డుకున్నారన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే మండపం ఏర్పాటు చేసుకుంటున్నామని, దయచేసి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం జూబ్లీహిల్స్ అధ్యక్షులు చంద్రశేఖర్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు దత్తు, మురళి తదితరులు పాల్గొన్నారు.

● పరామర్శ



బేగంపేటలోని ఎన్‌బీటీనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బీజేపీ యువనేత మర్రి పురురవారెడ్డి గురువారం ఎన్‌బీటీనగర్‌లోని లక్ష్మణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

- బేగంపేట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి)

కుటుంబ కలహాలకు తల్లీ పిల్లలు బలి

- ఇద్దరు పిల్లలను చెరువులోకి తోసి దూకిన తల్లి
- తల్లి, కుమారుడి మృతదేహాలు లభ్యం
- లభించని కుమార్తె ఆచూకీ
- గాలిస్తున్న పోలీసులు



మృతులు మంగ, శరత్, ప్రాణాలతో బయటపడిన విఘ్నేష్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): భార్యా భర్తల కలహాలు ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. తల్లీ కుమారుడు మృత్యువు పాలవ్వగా, కుమార్తె జాడ దొరకకుండా పోయింది. భర్తతో కలహాలతో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు, కుమార్తెతో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. ఓ కుమారుడు, కుమార్తెను ఆ చెరువులోకి తోసింది. తర్వాత తానూ దూకింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించాడు. వారి మృతదేహాలను పోలీసులు వెలికి తీశారు. అయితే, కుమార్తె జాడ మాత్రం తెలియకుండా పోయింది. ఆమె కోసం పోలీసులు చెరువులో ముమ్మరంగా గాలిస్తున్నారు. ముగ్గురు పిల్లలతో చెరువు వద్దకు చేరిన ఆ తల్లి ఇద్దరిని మాత్రమే చెరువులోకి తోసి ఒక కుమారుడిని ఎందుకు వదిలివేసిందో ఎవరికీ అంతుచిక్కడం లేదు. వివరాల్లోకి వెళితే.. వనస్థలిపురం సంపూర్ణ థియేటర్ కూరగాయల మార్కెట్ దగ్గర నివాసముంటున్న ఒరుసు కుమార్‌కు భార్య మంగ (35), కుమార్తె లావణ్య (15), కుమారులు విఘ్నేష్ (5), శరత్ (7) ఉన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మంగ తన పిల్లలను తీసుకొని బస్సులో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. పెద్దతూము కింద మెట్ల వెంట కిందికి దిగిన మంగ.. కుమార్తె లావణ్య, కుమారుడు శరత్‌ను నీళ్లలో తోసి తాను కూడా నీళ్లలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, మరో కుమారుడు విఘ్నేష్ మాత్రం తప్పించుకొని ఒడ్డునే ఉండి ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గాలింపు చేపట్టగా.. మంగ, శరత్‌ల మృతదేహాలు లభ్యమయ్యాయి. లావణ్య ఆచూకీ లభ్యం కాలేదు. కాగా లావణ్య, శరత్, విఘ్నేష్‌లు వనస్థలిపురం ప్రశాంతి విద్యానికేతన్ స్కూల్‌లో చదువుతున్నారు. మూడు, నాలుగు రోజులుగా ఇంట్లో భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. దాంతో పిల్లలను స్కూలు నుంచి తీసుకువస్తానని చెప్పి మంగ.. వారిని తీసుకొని నేరుగా ఇబ్రహీంపట్నం వచ్చినట్లు బంధువులు తెలిపారు. కాగా కుమార్, మంగలది రెండో వివాహమని అప్పటికే ఇద్దరికీ పెళ్లిళ్లు కాగా.. విడాకులు తీసుకుని పెళ్లి చేసుకున్నారు. కుమార్తె లావణ్య మంగ మొదటి భర్త సంతానమని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో పైలం

- నకిలీ వెబ్‌సైట్లు సృష్టిస్తున్న సైబర్ కేటుగాళ్లు
- భారీ డిస్కౌంట్ల పేరుతో ఆకర్షిస్తున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్ సైట్లలో భారీ డిస్కౌంట్‌ల పేరుతో సైబర్ కేటుగాళ్లు కొత్తరకం మోసాలకు తెరతీస్తున్నారు. వినాయక చవితి, దసరా, దీపావళి.. వరుస పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లకు పెరిగిన అధిక గిరాకీని అవకాశంగా తీసుకుంటున్న కేటుగాళ్లు సైబర్ మోసాలకు తెరతీస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారిని టార్గెట్ చేస్తూ నకిలీ వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, శారీస్ తక్కువ ధరకే ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పించి.. పండుగ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ల పేరిట సోషల్‌మీడియా, ఆన్‌లైన్‌లో పోస్టులు పెడుతున్నారు. వెనుకా ముందు చూడకుండా ఆ నకిలీ వెబ్‌సైట్ల లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. ఆర్డర్ బుక్‌చేసి, డబ్బులు చెల్లించిన తర్వాత ఎంతకీ పార్శిల్ చేతికి రాక మోసపోతున్నారు. అనుమానం వచ్చిన కస్టమర్లు అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ చేసి ఉంటాయి. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న సైబర్ ముఠాలు కొన్ని అయితే.. మరికొన్ని సైబర్ ముఠాలు మాత్రం తిరిగి డబ్బులు చెల్లిస్తామంటూ క్యూఆర్ కోడ్‌లు పంపి కస్టమర్ల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఇలా పండుగ ఆఫర్‌ల పేరుతో నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లు సృష్టిస్తున్న కేటుగాళ్లు అందినంతా దండుకుంటున్నారు.

ప్రతి సైట్‌ను క్లిక్ చేయొద్దు..

ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతి ఈ కామర్స్ సైట్‌ను ఓపెన్ చేయొద్దు. నమ్మకమైన ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లనే ఎంచుకోవాలి. సాధ్యమైనంత వరకు క్యాష్ ఆన్ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో అడగగానే బ్యాంకు ఖాతాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వ్యాలెట్స్ వివరాలు నమోదు చేయొద్దు. ఆ వివరాలన్ని సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్తాయని గుర్తుంచుకోవాలి. ఒక్కసారి డబ్బులు పోగొట్టుకుంటే తర్వాత తిరిగి రావనే విషయాన్ని కస్టమర్లు తెలుసుకోవాలి.

- సైబర్ క్రైమ్ పోలీసులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎన్‌డీఎంఏ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

- బేగంపేట, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి)



ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

- బంజారాహిల్స్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి)

దీక్ష విరమణ..



బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో 12 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న బీసీ మహాసభ అధ్యక్షుడు సిద్దేశ్వర్ గురువారం దీక్ష విరమించారు. బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావుతో పాటు ఇతరులు నిమ్మరసం ఇచ్చిన ఆయనతో దీక్షను విరమింపజేశారు. అంతకు ముందు సిద్దేశ్వర్‌ను ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి కలిసి మద్దతు పలికారు. (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ విద్యార్థులకు వైద్య చికిత్సలు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు చేయిస్తున్నామని తుకారాంగేట్ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ శోభ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా పోషన్ అభియాన్ వారోత్సవాలు ఈనెల 1 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు.

గణేశ్ నవరాత్రులకు ఇబ్బందులు రాకుండా చర్యలు

బౌద్ధనగర్, సెప్టెంబర్5(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రోత్సవాలు సవ్యంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. గురువారం వారాసిగూడ ప్రధాన రహదారిలో చెట్ల కొమ్మల నరికివేత పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. శనివారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వినాయక విగ్రహాలను మండపాలకు తరలించేటప్పుడు చెట్టుకొమ్మలు అడ్డురాకుండా తొలగిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఇన్‌చార్జి సురేష్ పాల్గొన్నారు. అనంతరం ఫ్రైడే మార్కెట్‌లో కార్పొరేటర్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. స్థానికంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతోందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ బస్తీవాసులకు తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి కార్యాలయంలో గురువారం మట్టి గణపతి విగ్రహాలను బస్తీవాసులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, వార్డు ఇన్‌చార్జి సౌజన్య మనోహర్, శ్రీనివాస్‌గౌడ్, దాసరి శ్రీనివాస్ పొన్నాల రాజు, అమర్, దేవయ్య, శంకర్, అబ్బమ్మలు పాల్గొన్నారు.

(అడ్డగుట్ట- ఆంధ్రజ్యోతి)

జాతీయ వెయింట్ లిఫ్టింగ్ పోటీలకు రేవంత్ ఎంపిక



బౌద్ధనగర్, సెప్టెంబర్5(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన వెయిట్ లిఫ్టర్ జీఎం రేవంత్ ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ అండ్ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 61 కేజీల విభాగంలో రేవంత్ పాల్గొని పతకాన్ని సాధించాడు. త్వరలో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి వెయింట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు హైదరాబాద్ వెయింట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శివకుమార్, శ్రవణ్‌కుమార్, రాజు, జింఖానా కోచ్ హేమలతలు జీఎం రేవంత్‌ను అభినందించా రు. రేవంత్ సీతాఫల్‌మండిలోని శ్రీసాయి విద్యావికాస్ జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ ఛైర్మన్ యాదగిరి

తార్నాక, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట్ ప్రధాన రహదారి నుంచి శ్రీపురి కాలనీకి వెళ్లే మార్గంలో రైల్వే అధికారుల అభ్యంతరం కారణంగా నిలిచిపోయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ ఛైర్మన్ బి. యాదగిరి అన్నారు. గురువారం ఆయన లాలాపేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, లాలాపేట్‌లోని శ్రీపురి కాలనీకి వెళ్లే మార్గంలో రెండేళ్ల క్రితం సీసీ రోడ్డు నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు పాత రోడ్డును తవ్వారన్నారు. అయితే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎటువంటి అనుమతి లేదని రైల్వే అధికారులు పనులను అడ్డుకున్నారని, రెండేళ్లుగా గుంతలు పడిన ఈ రోడ్డు మార్గంలో రాకపోకలకు సాగించేందుకు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు రైల్వే అధికారులతో చర్చించి సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో పైలం

- నకిలీ వెబ్‌సైట్లను సృష్టిస్తున్న సైబర్ కేటుగాళ్లు
- భారీ డిస్కౌంట్ల పేరుతో ఆకర్షిస్తున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్ సైట్లలో భారీ డిస్కౌంట్‌ల పేరుతో సైబర్ కేటుగాళ్లు కొత్తరకం మోసాలకు తెరతీస్తున్నారు. వినాయక చవితి, దసరా, దీపావళి.. వరుస పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లకు పెరిగిన అధిక గిరాకీని అవకాశంగా తీసుకుంటున్న కేటుగాళ్లు ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారిని టార్గెట్ చేస్తూ నకిలీ వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, శారీస్ తక్కువ ధరకే ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పించి.. పండగ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ల పేరిట సోషల్‌మీడియా, ఆన్‌లైన్‌లో పోస్టులు పెడుతున్నారు. వెనుకా ముందు చూడకుండా ఆ నకిలీ వెబ్‌సైట్ల లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. ఆర్డర్ బుక్‌చేసి, డబ్బులు చెల్లించిన తర్వాత ఎంతకీ పార్శిల్ చేతికి రాక మోసపోతున్నారు. అనుమానం వచ్చిన కస్టమర్లు అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న సైబర్ ముఠాలు కొన్ని అయితే.. మరికొన్ని ముఠాలు తిరిగి డబ్బులు చెల్లిస్తామంటూ క్యూఆర్ కోడ్‌లు పంపి కస్టమర్ల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వినతి

తార్నాక, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించడమే కాకుండా, తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఎన్నికల కమిషనర్‌ను కోరానని తెలిపారు.



మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా టీడీపీ మల్కాజిగిరి పార్లమెంట్ జనరల్ సెక్రటరీ గౌరీశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని మదర్‌థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పించారు. సెయింట్ మేరీస్ బసలికా చర్చ్ ఫాదర్లు ఆరోగ్యం, డేవిడ్, సిస్టర్ నాన్సీ, పాల్‌అల్ఫన్స్, ఆరోగ్యనాథన్ తదితరులు పాల్గొన్నారు. (రెజిమెంటల్‌బజార్-ఆంధ్రజ్యోతి)



సీతాఫల్‌మండి చౌరస్తాలో వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి మాస్టార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జంపన ప్రతాప్



ఉపాధ్యాయులను సత్కరించిన వాసవిక్లబ్ సీనియర్ సిటిజన్స్

సమాజాభ్యున్నతిలో ఉపాధ్యాయులే కీలకం

- దైవంగా భావించి గౌరవిద్దాం..
- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వక్తలు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): సమాజాభ్యున్నతిలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయులను దైవంగా భావించి, గౌరవించాలని వక్తలు పిలుపునిచ్చారు. కుల, మత, వర్గ, భాష తారతమ్యం లేకుండా పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి శ్రమించే అధ్యాపకులకు యావత్ సమాజం ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదని వారు అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అధ్యాపకులను ఘనంగా సత్కరించి, వారి సేవలను ప్రశంసించారు.

ఎమ్మెల్యేగా ఉన్నానంటే ఉపాధ్యాయులే కారణం : శ్రీగణేశ్

తిరుమలగిరి సెప్టెంబర్05 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్స్ కాలనీలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీచర్స్ కాలనీ లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. శ్రీగణేశ్ మాట్లాడుతూ, సమాజంలో చిన్నారుల జీవితాల్లో అమ్మానాన్నల తర్వాత ప్రధాన భూమిక పోషించేది ఉపాధ్యాయులే అని అన్నారు. తాను ప్రస్తుతం ఎమ్మెల్యే స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం ఆ కాలంలో తనకు విద్యా బుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులే అని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత, టీచర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సబిత, మంజుభార్గవి తదితరులు ఉన్నారు.



రసూల్‌పురా ప్రభుత్వ పాఠశాలలో అధ్యాపకులను సత్కరిస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ ఛైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్

సీతాఫల్‌మండిలో ..

బౌద్ధనగర్, సెప్టెంబర్5(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి చౌరస్తాలో ఉపాధ్యాయుల దినోత్సవం, గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమరావతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మాస్టార్ వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి విగ్రహానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులకు పాదాభివందనం చేశారు. స్కూల్ కరస్పాండెంట్స్ ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేంకటేశ్వరెడ్డి, ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, కవితారెడ్డి, వీణారెడ్డి, దశరథ్ పాల్గొన్నారు.



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రిన్సిపాల్ బానోతు లాలూనాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఐటీడీఏ శాఖ ప్రాజెక్టు అధికారులు సర్వేశ్వర రెడ్డి, చందన ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గిరిజన శాఖ డీటీడీఓ కోట జి, స్పోర్ట్స్ అధికారిణి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం..

ప్రపంచంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు. హెడ్ మాస్టర్ ఆశీర్వాదం, పద్మావతి, సరితారాణి, శోభారాణి, హరనాథ్, అనిత పాల్గొన్నారు.



బాపూజీనగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో ప్రభుత్వ గిరిజన శాఖ అధికారులు

ఉపాధ్యాయులు భవిష్యత్ నిర్మాతలు

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు భవిష్యత్ నిర్మాతలని వాసవి క్లబ్ కేసీజీఎఫ్ సికింద్రాబాద్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు గౌరీ శంకర్ అన్నారు. గురువారం టీచర్స్ డే సందర్భంగా ఆర్పీ రోడ్డులోని బూరుగు విశ్వనాథం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం వాసవి క్లబ్ కేసీజీఎఫ్ సికింద్రాబాద్ సీనియర్ సిటిజన్స్ వార్షిక కార్యక్రమంలో భాగంగా పలువురు జర్నలిస్టులను సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మనసానిపల్లి అమర్నాథ్, కోశాధికారి ఎర్రం రాములు, డిస్ట్రిక్ ఇన్‌చార్జి మంచికంటి ప్రకాష్, రీజియన్ ఛైర్మన్ అరుగుల ప్రకాష్ రావు, జోన్ ఛైర్మన్ కాపర్తి పాండురంగం, రీజన్ సెక్రటరీ చందా జగదీష్ పాల్గొన్నారు.

మహబూబ్ కాలేజ్‌లో..

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): మహబూబ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహంచారు. కళాశాల సెక్రటరీ భగవత్ వారణాసి,ప్రిన్సిపాల్ పురుషోత్తమ్ ఆధ్వర్యంలో లెక్చరర్‌లకు బెస్ట్ లెక్చరర్ అవార్డులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహబూబ్ కాలేజ్ అధ్యక్షుడు పీఎల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నరేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు ఉపాధ్యాయులు బాటలు

మారేడుపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి భవితకు బాటలు వేసే బాధ్యతను నిర్వహించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని ఈశ్వరీబాయి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ రామచంద్రా రెడ్డి కొనియాడారు. మారేడుపల్లి గీతా నర్సింగ్ హోమ్‌లో ఈశ్వరీబాయి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బీఎన్ ప్రసన్న కుమారితో పాటు ఉపాధ్యాయులను ట్రస్ట్ కళాశాల వైస్ ఛైర్మన్ ఘనంగా సత్కరించారు. డాక్టర్ డి.రామచంద్రా రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బీఎన్ ప్రసన్న కుమారి, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



నర్సింగ్ కళాశాల ప్రధానోపాధ్యాయురాలిని సత్కరిస్తున్న డాక్టర్ రామచంద్రా రెడ్డి

పర్యావరణ పరిరక్షణకు మట్టిగణపతులను పూజిద్దాం

సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, సెప్టెంబర్5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని, అందుకే మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో భక్తులకు ఆయన మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ, బల్దియా అధికార యంత్రాంగం గణనాథుడి మట్టి విగ్రహాలను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేయడం ఆనందకరమన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని అన్ని వార్డు కార్యాలయాల్లో మట్టి వినాయక ప్రతిమలను అందుబాటులో ఉంచి భక్తులకు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. వినాయక చవితి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారుకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సామలహేమ, సమన్వయకర్త రాజు సుందరం నాయకులు సుంకు రామచందర్, జి.చంద్రశేఖర్, శైలేందర్, రవీంద్రసాగర్, బెజ్జంకి రాజేష్, అశ్విన్, టీఆర్‌టీ శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



యువతికి వినాయకుడి మట్టివిగ్రహాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు



తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి స్థానికులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి (తార్నాక, ఆంధ్రజ్యోతి)

సీపీఆర్ చేసి ప్రాణం పోశారు!

- ఉరి వేసుకుంటున్న వ్యక్తిని కాపాడిన గోపాలపురం పోలీసులు



వినోద్‌కు సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుళ్లు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకోగా, గోపాలపురం పోలీసులు సీపీఆర్ చేసి అతడి ప్రాణాన్ని కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజారుకు చెందిన వినోద్ గురువారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కూతవేటు దూరంలో ఉన్న గోపాలపురం పోలీసులకు ఈ విషయంపై సమాచారం అందింది. వెంటనే పెట్రోకార్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మల్లేష్‌యాదవ్ వినోద్ ఇంటికి చేరుకున్నారు. కిటికీనుంచి చూడగా వినోద్ మెడకు తాడు బిగించుకొని ఆత్మహత్య చేసుకుంటూ కనిపించాడు. తలుపులు బద్ధలుకొట్టి గది లోపలికి వెళ్లిన కానిస్టేబుళ్లు అతడిని కిందికి దించారు. అపస్మారకస్థితికి చేరుకున్న అతడికి సీపీఆర్ చేసి ప్రాణం నిలబెట్టారు. ప్రాథమిక వైద్యం అందించేందుకు బాధితుడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. క్షణాల్లో వచ్చి వ్యక్తిని కాపాడిన కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మల్లేష్ యాదవ్‌లను బస్తీవాసులు అభినందించారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఏసీపీ సర్దార్ సింగ్, మక్తాల జలందర్ గౌడ్ తదితరులు

మట్టి విగ్రహాలను పూజించాలి

- ఏసీపీ సర్దార్ సింగ్

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మట్టి విగ్రహాలను పూజించాలని మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్ పిలుపునిచ్చారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధి సోమసుందరం వీధిలోని మక్తాల ఫౌండేషన్ కార్యాలయం వద్ద 500 మట్టి వినాయకులను భక్తులకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్దార్ సింగ్ మాట్లాడుతూ, పూర్వం మట్టి విగ్రహాలనే పూజించేవారని, ఆ సాంప్రదాయాన్ని కొనసాగించే విధంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మక్తాల జలంధర్ గౌడ్, మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కర్ చారి, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ మాజీ ధర్మకర్త సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవర్తన మార్చుకోపోతే కఠిన చర్యలు

- రౌడీషీటర్లకు డీసీపీ రేష్మి పెరుమాల్ హెచ్చరిక

అడ్డగుట్ట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాల్ హెచ్చరించారు. గురువారం డీసీపీ కార్యాలయానికి నార్త్ జోన్ పరిధిలో ఉన్న 107 మంది రౌడీషీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, గతంలో ఏం జరిగిందో ఏమో కానీ మీ ప్రవర్తనలో మార్పు రాకుంటే మాత్రం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే నేరాలు, చిన్న చిన్న కేసుల కారణంగా మీ కుటుంబం చిన్నా భిన్నం అవుతుందని, భార్యాపిల్లలు అనాథ లుగా మారతారని అన్నారు. గతంలో మీరు చేసిన నేరాల్లో కేసుల విచారణ చివరి దశకు వచ్చే సమయంలో మళ్లీ నేరాలు చేస్తున్నారని, అలా మరోసారి చేయొద్దని హెచ్చరించారు. మీపై పో లీసు నిఘా ఎప్పుడూ ఉంటుందని, ప్రతి రోజూ మీరు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం పని చేస్తున్నారు అనేది గమనిస్తూనే ఉంటామని రౌడీషీటర్లతో డీసీపీ అన్నారు.



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న నార్త్ జోన్ డీసీపీ రేష్మి పెరుమాల్

'అవినీతి, నిర్లక్ష్యం'పై డిస్కం చర్యలు

- ఆరుగురు సస్పెన్షన్, నలుగురు కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ
- 9 మందికి షోకాజ్ నోటీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో అవినీతికి పాల్పడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో 7 నెలల్లో 19 మంది ఇంజనీర్లు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆరుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేయగా, నలుగురిని కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. 9 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అవినీతి ఆరోపణల జాబితాలో మరికొంతమంది అధికారుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దృష్టి

గ్రేటర్‌జోన్ శివారు సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులపై ఎక్కువ అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. కొండాపూర్ డివిజన్‌లోని అల్లాపూర్ సెక్షన్‌లో ఓ లైన్‌మన్‌తో పాటు ఇద్దరు ఆర్టిజన్లను సస్పెండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేడ్కర్‌ను కార్పొరేట్ ఆఫీస్‌కు అటాచ్‌చేయగా, నార్సింగ్ ఏఈ సందీప్ రెడ్డిని సస్పెండ్ చేశారు. మేడ్చల్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలోని పలు సబ్‌డివిజన్లలో కొంతమంది ఏడీఈలతో పాటు ఏఈలపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. వీరిని త్వరలో జరిగే బదిలీల్లో కార్పొరేట్ ఆఫీస్‌తో పాటు ఆఫీస్ పోస్టులకే పరిమితం చేయనున్నారు.

కీలకమైన మెట్రోజోన్ సీఈ పోస్టు ఖాళీ

గ్రేటర్ విద్యుత్ సరఫరాలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా బాధ్యతలు నిర్వహించిన మోహన్‌రెడ్డి ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆపరేషన్ విభాగంలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. సీనియర్ స్థాయి ఎస్ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కుటుంబ కలహాలకు తల్లీపిల్లలు బలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల కలహాలు ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. తల్లి, కుమారుడు మృతి చెందగా, కుమార్తె జాడ దొరకలేదు. భర్తతో కలహాలతో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు, కుమార్తెతో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. ఓ కుమారుడు, కుమార్తెను చెరువులోకి తోసి తానూ దూకింది. తల్లి, కుమారుడు మృతి చెందారు. కుమార్తె జాడ తెలియలేదు. ఆమె కోసం పోలీసులు చెరువులో ముమ్మరంగా గాలిస్తున్నారు. వనస్థలిపురం సంపూర్ణ థియేటర్ కూరగాయల మార్కెట్ వద్ద నివసిస్తున్న ఒరుసు కుమార్‌కు భార్య మంగ(35), కుమార్తె లావణ్య(15), కుమారులు విఘ్నేష్(5), శరత్(7) ఉన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో మంగ పిల్లలను తీసుకొని బస్సులో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. పెద్దతూము కింద మెట్ల వెంట కిందికి దిగిన మంగ.. కుమార్తె లావణ్య, కుమారుడు శరత్‌ను నీళ్లలో తోసి తాను దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మరో కుమారుడు విఘ్నేష్ తప్పించుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది మంగ, శరత్ మృతదేహాలను బయటకు తీశారు. లావణ్య ఆచూకీ లభ్యం కాలేదు. మూడు, నాలుగు రోజుల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. దాంతో పిల్లలను స్కూలు నుంచి తీసుకువస్తానని చెప్పి మంగ.. వారిని తీసుకొని నేరుగా ఇబ్రహీంపట్నం వెళ్లినట్లు బంధువులు తెలిపారు. కుమార్, మంగలది రెండో వివాహమని, లావణ్య మంగ మొదటి భర్త సంతానమని సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.